విజయనగరం

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



పట్టపగలే చోరీ..!

ఎస్.కోట మండలం పోతనాపల్లి గ్రామంలోని కిలపర్తి కొండమ్మ ఇంట్లో సోమవారం ఉదయం దొంగలు పడ్డారు. 15 తులాల బంగారు ఆభరణలు దోచుకుపోయారు. -8లో



త్వరలో శాటిలైట్ వ్యవస్థ పటిష్టం

అగ్నిమాపక కేంద్రాల్లో శాటిలైట్ వ్యవస్థను పటిష్టపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విపత్తులు, అగ్నిమాపక శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు అన్నారు. - 8లో

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ



బాధ్యతలు చేపట్టిన జేసీ సేతుమాధవన్

విజయనగరం టౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సనల్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, కార్యాలయ సిబ్బంది జేసీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బబిత



బబిత



బదిలీ అయిన కళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ ఎం.బబితను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ మూడేళ్లుగా పనిచేస్తున్న బి.సాయికళ్యాణ్ చక్రవర్తిని గుంటూరుకు బదిలీచేసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సాయికళ్యాణ్ చక్రవర్తి న్యాయపరిపాలనలో తమదైన ముద్రవేసుకున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లపై అవగాహన కల్పిస్తూ పెండింగ్ కేసుల పరిష్కారానికి విశేష కృషిచేశారు. కొత్త కోర్టు మంజూరు, నిర్మాణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. సీనియర్ సిటిజన్స్ సౌకర్యార్థం కోర్టులో లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. కోర్టు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. విరివిగా న్యాయ అవగాహన సదస్సులను ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతులను చేశారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ న్యాయవాది

విజయనగరం లీగల్: ప్రభుత్వ న్యాయవాదిగా రెడ్డి సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతవరకు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేసిన టి.వి.శ్రీనివాసరావు పదవీ కాలం ముగిసింది.

మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా లక్ష్మీనారాయణ



బాధ్యతలు చేపడుతున్న లక్ష్మీనారాయణ

విజయనగరం టౌన్: విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల మైనారిటీ వెల్ఫేర్ అధికారిగా పీఎస్‌వీ లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా, మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా ఆయన అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.





ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు డి.ఏసు. ఇతనిది విశాఖపట్నం జిల్లా మధురవాడ. గత నెల 24వ తేదీన విజయనగరంలోని ఓ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఈయన గుండెకు స్టంట్ వేశారు. తదుపరి చికిత్స కోసం సోమవారం రావాలని చెప్పడంతో వ్యయప్రయాసలకోర్చి ఆస్పత్రికి వచ్చారు. సమ్మెలో ఉన్నందున చికిత్స అందించలేమని వైద్యులు చెప్పడంతో చేసేది లేక ఇంటిముఖం పట్టారు.



ఆరోగ్యశ్రీ సేవలు బంద్...
రోగులకు అవస్థలు!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు లగుడు త్రినాథ్. ఇతనిది మెంటాడ మండలం లోతుగెడ్డ గ్రామం. ఇతనికి గత నెల 18వ తేదీన విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో బ్రెయిన్ సర్జరీ జరిగింది. తదుపరి చికిత్స కోసం కుటుంబ సభ్యులు సోమవారం ఆస్పత్రికి తీసుకొచ్చారు. సమ్మెలో ఉన్నందున చికిత్స అందించలేమని ఆస్పత్రి సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు.

- చికిత్సకోసం ఆస్పత్రికి వచ్చే వారికి తప్పని తిప్పలు
- కొంతమంది సొంత డబ్బులతో వైద్యం చేయించుకునే పరిస్థితి

విజయనగరం ఫోర్ట్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు క(న)ష్టాలే ఎదురవుతున్నాయి. ఇప్పటికే సంక్షేమ పథకాలను అటకెక్కించింది. రైతు, విద్యార్థి వర్గాలకు ఆర్థిక సాయం అందజేయకుండా వేదనకు గురిచేస్తోంది. ఇప్పుడు అత్యవసరమైన వైద్య సేవలపైనా కినుక వహిస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు ఆధారమైన ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకంపై నిర్లక్ష్యం వహిస్తోంది. బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తూ ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తోంది. బిల్లులు చెల్లించేవరకు వైద్యసేవలు అందించేది లేదని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సిబ్బంది సోమవారం సమ్మెబాట పట్టడంతో రోగులు విలవిల్లాడారు. వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చిన రోగులు ఆవేదనకు గురయ్యారు. అత్యవసర వేళ కొంతమంది డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోగా, ఆర్థిక స్థోమతలేని వారు ఇంటిముఖం పట్టారు.

తప్పని తిప్పలు..

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకున్న వారు, శస్త్రచికిత్స చేసుకున్న వారు తదుపరి చికిత్స కోసం సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రికి వస్తారు. అటువంటి వారికి కూడా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. కొందరు డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి. పేదల ఆరోగ్య సంజీవినిగా పేరుగాంచిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రచేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బకాయిలు చెల్లించకపోతే వైద్య సేవలు నిలిపివేస్తామని పలుమార్లు నెట్‌వర్క్ ఆస్పత్రులు నోటీసులు ఇచ్చినా కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడం దీనికి బలం చేకూర్చుతోంది. పోతే పేదల ప్రాణాలే కదా పోతాయన్న ప్రభుత్వ ధోరణిని జనం దుయ్యబడుతున్నారు.



విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి హెల్ప్‌డెస్క్ వద్ద ఆరోగ్యశ్రీ సేవలు తిరిగి ఎప్పుడు అందిస్తారని ప్రశ్నిస్తున్న రోగి బంధువులు

ప్రైవేట్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం సేవలను అభినవ్ ఆస్పత్రి, కొలపర్తి, సాయి పీవీఆర్, సాయి సూపర్ స్పెషాలిటీ, వెంకటరామ, ఆంధ్ర, మారుతి, పీజీ స్టార్, స్వామి ఐ, నెఫ్రోప్లస్, మిమ్స్, మువ్వ గోపాల, కాస్వి, క్వీన్స్ ఎస్ఆర్ఐ, గాయిత్రి, పుష్పగిరి, తిరుమల మెడికవర్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, పిలిడోపియా, అమృత, సంజీవిని, శ్రీ బాపూజీ, సంజీవిని సూపర్ స్పెషాలటీ, సాయికృష్ణ, విజయ మల్టీ స్పెషాలిటీ, వెంకట పద్మ వంటి ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు అందిస్తున్నాయి. ఈ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.25కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది.

సేవలు అందించలేమని చెప్పేశారు..



నా పేరు ఎస్.శంకర్. మాది మెంటాడ మండలం లోతుగెడ్డ. మా మేనత్తకు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఈఏడాది మార్చి నెలలో వెన్నెపూసకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించాం. తదుపరి చికిత్స కోసం సోమవారం ఆస్పత్రికి వచ్చాం. ప్రభుత్వం బకాయి బిల్లులు చెల్లించని కారణంగా సమ్మెలో ఉన్నాం.. సేవలు అందించలేం అని వైద్యులు చెప్పారు. చేసేది లేక ఇంటికి వెళ్లిపోతున్నాం.

ఇదెక్కడి ఘోరం...

పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంపై రోగుల బంధువులు భగ్గుమంటున్నారు. గతంలో ఏ రోజూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని, ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని వస్తే మెరుగైన వైద్యసేవలు అందేవని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరును దుమ్మెత్తి పోస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం వైద్యసేవల ఖర్చు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచడంతో పాటు ఏనాడూ పేదలకు వైద్యసేవలు అందజేయడంలో నిర్లక్ష్యం చేయలేదని చెబుతున్నారు. మరోవైపు ఆరోగ్య ఆసరా కింద రోగులు కోలుకునేవరకు ఆర్థిక భృతి అందజేసేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజారోగ్యమంటే లెక్కలేదని వాపోతున్నారు.

డోలీలో ప్రసవ వేదన..



నిండు గర్భిణి బోడమ్మను డోలీలో మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు

చిత్రంలో డోలీలో తరలిస్తున్న నిండు గర్భిణి పేరు సోముల బోడమ్మ. ఆమెది ఎస్.కోట మండలంలోని చిట్టింపాడు గిరిశిఖర గ్రామం. సోమవారం పురిటినొప్పులు ఆరంభం కావడంతో భర్త రాముతో పాటు కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. గ్రామానికి వాహనం వచ్చేదారి లేక.. రాళ్ల దారిలో 10 కిలోమీటర్ల మేర డోలీలోనే బొడ్డవర వరకు గర్భిణిని తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి వాహనంలో తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. ఈ ఘటనపై గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ అడవితల్లి బాట పట్టిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. తల్లుల ప్రసవ వేదనను ఆలకించాలని కోరారు. ఉత్తుత్తి రోడ్ల ప్రారంభంతో ప్రయోజనం ఉండదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మన్యంలో ప్రతి పల్లెకు పక్కా రోడ్డు అంటూ ఇచ్చిన హామీని చేతల్లో చూపించాలని డిమాండ్ చేశారు. - ఎస్.కోట

దేవుడా.. మాకు దిక్కెవరు..

- పశ్చిమబెంగాల్‌లో జీఆర్ఈఎఫ్ జవాన్ మృతి
- వీరభద్రపురానికి మృతదేహం తరలింపు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

కొత్తవలస:



బాగున్నావా.. పిల్లలు ఏం చేస్తున్నారు.. చక్కగా చదువుతున్నారా.. ఆరోగ్యం జాగ్రత్త.. అమ్మనాన్నలు బాగున్నారా.. అంటూ ఫోన్‌లో కుటుంబ క్షేమ వివరాలు తెలుసుకున్న భర్త.. విగతజీవిగా కళ్లముందు కనిపించేసరికి భార్య కన్నీటిశోకంలో మునిగిపోయింది. దేవుడా.. ఎంత పనిచేశావంటూ భర్త మృతదేహాన్ని పట్టుకుని బోరున విలపించింది. పారామిలటరీ జవాన్ మృతితో కొత్తవలస మండంలోని వీరభద్రపురం శోకసంద్రంలో మునిగిపోయింది. దేశ సాయుధ దళాల బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ)లో పారా మిలటరీకి చెందిన జీఆర్ఈఎఫ్ (జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్) విభాగంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పనిచేస్తున్న వీరభద్రపురం గ్రామానికి చెందిన రాయపురెడ్డి దేముడునాయుడు విధుల్లో ఉంటూ శనివారం వాంతులతో అస్వస్థతకు గురై అక్కడి మిలటరీ ఆస్పత్రిలో మృతిచెందారు. జవాన్ మృతి చెందిన విషయాన్ని ఆర్సీ-87 (జీఆర్ఈఎఫ్) మేజర్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్‌కుమార్ కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందల్, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని వీరభద్రపురానికి సోమవారం తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి భార్య నాగమణితోపాటు కుమారులు హర్షవర్ధన్(9), యశ్వంత్(7), తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహానికి మాజీ సైనిక ఉద్యోగులతో పాటు కొత్తవలస సీఐ షణ్ముఖరావు పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు. విజయనగరం నుంచి వచ్చిన ప్రత్యేక రిజర్వ్‌డ్ పోలీసులు గౌరవవందనం సమర్పించి గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు.



భర్త మృతదేహాన్ని చూస్తూ విలపిస్తున్న నాగమణి (ఇన్‌సెట్లో) దేముడునాయుడు (ఫైల్)

వస్తారా? ముఖం చాటేస్తారా?

- ప్రజాప్రతినిధుల ముందుకు రాలేకపోతున్న కూటమి ఎమ్మెల్యేలు
- గత మూడు జెడ్పీ సమావేశాల్లో ఒకసారి మాత్రమే హాజరు
- మళ్లీ 9న జెడ్పీ సమావేశానికి ఆహ్వానం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజాసంక్షేమం, అభివృద్ధి అంశాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జెడ్పీ సమావేశాలు మంచి అవకాశం. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే ఈ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారు. మూడుసార్లు జెడ్పీ సమావేశాలు జరిగితే ఒక్కసారి మాత్రమే కొంతమంది ముఖం చూపించారు. ఇక శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన... ఈ నలుగురూ ఒక్కసారి కూడా ఈ సమావేశాలకు హాజరుగాకపోవడం గమనార్హం. గ్రామీణ స్థాయిలో ప్రజలకు ప్రాతినిథ్యం వహించే ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఈ సమావేశాల్లో ప్రజల సమస్యలపై గళం వినిపిస్తుంటారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వాటిని ఏవిధంగా పరిష్కరిస్తారో చెబితే ఆ సమాచారం ప్రజలకు చేరుతుంది. కానీ అధికార టీడీపీ ఎమ్మెల్యేలకు ఆ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉదయం లేచింది మొదలు అక్కడ అసెంబ్లీలో ప్రతిపక్షానికి సూక్తులు చెప్పే ఈ నాయకులు... క్షేత్రస్థాయిలో అంతే కీలకమైన జెడ్పీ సమావేశాలకు మాత్రం డుమ్మా కొట్టేస్తున్నారు. మళ్లీ ఈనెల 9వ తేదీన జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానాలు పంపారు. ఈసారైనా హాజరవుతారా? లేదంటే ముఖం చాటేస్తారా? అనే చర్చ నడుస్తోంది.

ప్రశ్నలు ఎదుర్కోలేకేనా?

సార్వత్రిక ఎన్నికల సమరంలో గట్టెక్కడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు మేనిఫెస్టోలో అనేక హామీలు గుప్పించారు. అరకు ఎంపీ మినహా ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు, విజయనగరం ఎంపీ టీడీపీ, జనసేన కూటమి ఖాతాలోనే చేరాయి. అంటే దాదాపుగా ఉమ్మడి జిల్లాలో ప్రజలకు మేలు చేయాల్సిన బాధ్యత వారిదే. కానీ ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారు. కేవలం సామాజిక పింఛన్ల పెంపు హామీ ఒక్కటే ఇప్పటివరకూ కూటమి ప్రభుత్వం అమలుచేసింది. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీ కూడా ఒక్క సిలిండర్‌కే సరిపెట్టారు. ఉగాది నుంచి అమలుచేస్తామన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తుస్సుమనిపించారు. తల్లికి వందనం ఏప్రిల్ నుంచి, రైతుభరోసా పెట్టుబడి సాయం మే నెల నుంచి అమలుచేస్తామని చెబుతున్నా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కనిపించలేదు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలు మొదలయ్యాయి. రోడ్ల మరమ్మతులు అంతంతమాత్రమే. గోకులం షెడ్లకు బిల్లులు ఇవ్వలేదు. మరోవైపు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. వీటన్నింటిపై ఎంపీపీలు, జెడ్పీటీసీలు ప్రశ్నించడానికి సిద్ధమవుతున్నారు. వీటికి సమాధానం చెప్పడానికి కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు ఈసారైనా జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు హాజరుకావాలి.

29.6.2024



ఖాళీగా ఉన్న సీట్లు (ఫైల్)

జిల్లాపరిషత్‌లో కీలకమైన స్థాయీసంఘ సమావేశాలకు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులను అధికారులు ఆహ్వానించారు. కానీ ఒక్కరూ హాజరుకాలేదు. సీజనల్ వ్యాధులు, రైతులకు విత్తనాల సరఫరా తదితర కీలక అంశాలపై సమీక్ష జరిగినా అధికార పార్టీ తరపున సమాధానం చెప్పేవారే కరువయ్యారు.

12.07.2024



జెడ్పీ సమావేశం (ఫైల్)

సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారిగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం మాధవి, పూసపాటి అదితి గజపతిరాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర మాత్రమే హాజరయ్యారు.

9.1.2025



హాజరుకాని ప్రజాప్రతినిధులు(ఫైల్)

జెడ్పీ సర్వసభ్య సమావేశం రెండో సారి జరిగింది. ఎంతో కీలకమైన అంశాలు, ప్రజాసమస్యలపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే వేదిక అయినప్పటికీ కూటమి పార్టీల నుంచి ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా హాజరుకాలేదు. మొత్తంగా డుమ్మా కొట్టేశారు.

32 వేల మంది ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో వచ్చే మార్చి నాటికి గృహనిర్మాణ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని హౌసింగ్ ఏఈలను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. పీఎంఏవై 2.0 కొత్త గృహాల కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల మంది లబ్ధిదారులను గుర్తించామని, వారికి ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో గృహనిర్మాణ ప్రక్రియ, కొత్త ఇళ్ల మంజూరుపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఏవై (అర్బన్) 1.0 కింద మంజూరైన ఇళ్లలో 11,648 ఇళ్లలో 3,921 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 7,727 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవలే అదనపు సాయం కింద ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజన తెగలకు రూ.లక్ష చొప్పున మంజూరు చేసిందని, ఈ సాయాన్ని లబ్ధిదారులందరికీ వర్తింపజేయాలని చెప్పారు. మున్సిపాల్టీల్లో సుమారు 1,500 మంది లబ్ధిదారులు ఉన్నారని వీరికి ఈ అదనపు సాయాన్ని అందించేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు.

వృద్ధిరేటు పెరగాలి

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ అనుబంధ రంగాల్లో 12.97 శాతం ఉన్న వృద్ధి రేటును ఈ ఏడాదిలో 16.32 శాతానికి పెంచాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయంలో ఎటువంటి చర్యలు చేపట్టాలో వ్యవసాయాధికారులు మండలాల వారీగా ప్రణాళిక రుపొందించాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ అనుబంధ అధికారులతో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రధానంగా వరి పండుతోందని, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 25 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగవుతోందని, ఈ విస్తీర్ణాన్ని కూడా పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు, సీపీఓ బాలాజీ పాల్గొన్నారు.

ఎంటీయూ-1121 రకం సాగుకే మొగ్గు

- ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో 73 శాతం మంది రైతులు ఎంటీయూ-1121 (శ్రీధృతి) వరి రకం సాగుకే మొగ్గుచూపుతున్నట్టు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్ తెలిపారు. విజయనగరం గాజులరేగ ఏరువాక కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు రైతులు ఎంటీయూ-1121 రకానికి ప్రత్యామ్నాయ రకాలు అందించాలని వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి చేశారన్నారు. ఎంటీయూ-1224, ఎంటీయూ-1210, ఎంటీయూ-1310, ఎంటీయూ-1321 వరి రకాలు జిల్లా నేలలకు అనుకూలమని, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఎంటీయూ-1310, 1321 రకాలు మధ్యస్థ సన్న రకాలుగా పేర్కొన్నారు. ఎంటీయూ-1121 రకం ఎకరానికి 26 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఎంటీయూ-1310, 1321 రకాల సాగుతో 33 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎంటీయూ-1121 వరి రకం స్థానంలో ఎంటీయూ-1310, 1321, 1224 రకాలను 10 శాతం మేర సాగుకు ప్రోత్సహిస్తామన్నారు. వరిలో వెదపద్ధతే మేలని, సాగుఖర్చు ఎకరాకు రూ.7వేలు తగ్గుతుందన్నారు. వేరుశనగకు సంబంధించి కదిరి, లేపాక్షి రకం, నిత్య హరిత, విశిష్ట రకాలు జిల్లాకు అనుకూలమని పేర్కొన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాప్తి తగ్గిందన్నారు. పెసర పంటలో ఎల్‌బీజీ-607, 630, 574 రకాలు, మినుములో ఎల్‌బీజీ-884, 904, 932, టీబీజీ- 104, జీబీజీ-45 రకాలు పల్లాకు తెగులను తట్టుకుంటాయని తెలిపారు. సమావేశంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



నెల్లిమర్ల: స్వాధీనం చేసుకున్న బియ్యం

నెల్లిమర్ల: మండలంలోని బుచ్చన్నపేట జంక్షన్‌లో ఉన్న కురమా కమల ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల(19 బ్యాగులు) పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వారికి అందిన సమాచారం మేరకు ఆ విభాగం ఎస్సై రామారావు సిబ్బందితో కలిసి దాడిచేశారు. పట్టుబడిన బియ్యాన్ని బొప్పడాం రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు సీఎస్‌డీటీ శంకరరావు తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పెదబొండపల్లిలో..



పార్వతీపురం రూరల్: పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పార్వతీపురం రూరల్: తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లిలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లగేజీ ఆటోను అదుపులోకి తీసుకుని 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ డి. సింహాచలం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన మాట్లాడుతూ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం ముగడ గ్రామం నుంచి వయా పెదబొండపల్లి మీదుగా ఒడిశాలోని అలమండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో దారి కాచి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనలో పీడీఎస్ బియ్యంతో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని పార్వతీపురం రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు. దాడుల్లో పార్వతీపురం సీఎస్‌డీటీ ఎం.రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రేగిడి పాఠశాల ప్రతిభ



జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఉమామహేశ్వరిని అభినందిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు తదితరులు

రేగిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయస్థాయిలో చక్కని ప్రతిభ కనబరిచింది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్, న్యూఢిల్లీ అటల్ టింకరింగ్ ల్యాబ్, నీటి ఆయోగ్‌తో సంయుక్తంగా ఆన్‌లైన్‌లో 2024-25 ఏడాదికి గాను స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బూరవెల్లి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సృజనాత్మకంగా రూపొందించిన సహజసిద్ధమైన హెయిర్‌డై ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. దేశంలో మొదటి 100 స్థానాల్లో ఈ ప్రాజెక్టుకు చోటు లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికకాగా అందులో రేగిడి ప్రాజెక్టు ఒకటి. ఈ ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం మొదటి విడతగా రూ.35వేలు నిధులు విడుదల చేసిందని ఉపాధ్యాయిని ఉమా మహేశ్వరి తెలిపారు. ఈ ప్రాజెక్టును జూలై 29న ఢిల్లీలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, సైన్స్ అధికారి రాజేష్, జిల్లా సైన్స్‌ఫోరం ప్రతినిధులు సన్యాసినాయుడు, వేణుగోపాల్ తదితరులు ఉమామహేశ్వరిని అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్‌ఎస్‌కు 118 వినతులు



పార్వతీపురం టౌన్: అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం రూరల్: ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుంచి 110 అర్జీలు స్వీకరించారు. సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యతగల ఎండార్స్‌మెంట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు.

పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల్లో కొన్ని ఇలా..

- కురుపాం మండలం అగంగూడ గ్రామంలో 56 కుటుంబాల వారు తాగునీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో వేరే ప్రాంతానికి వెళ్లి నీరు తీసుకువస్తున్నామని, వేసవి కారణంగా బావినీరు ఇంకిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అర్జీ చేశారు.
- కొఠియా గ్రామాలైన పగలు చెన్నూరు, పట్టుచెన్నూరు, కొదమ, గంజాయిభద్ర గ్రామాల్లో విద్యార్థులకు తెలుగు భాష అర్థం కాకపోవడంతో జాతాపు వలంటీర్లను నియమించాలని అర్జీ అందజేశారు.
- పాచిపెంట మండలం ములయ కంబూరు పంచాయతీలో ములగపాడు, కందివలస, కాకులమామిడి గ్రామాలకు లాగే కీరంగి పంచాయతీలోని వంకమామిడి, కప్పరాయి గ్రామాలకు తాగునీటి బోర్లు మంజూరు చేయాలని విన్నవించారు.
- కురుపాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువలు, రహదారి పనులు పూర్తి చేసి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.
- జియ్యమ్మవలస మండలం బూరిరామినాయుడువలసలో సామాజిక భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్తులు వినతి అందజేశారు.
- వందశాతం వైకల్యంతో మంచాన పడిఉన్న తనకు ఎన్‌టీఆర్ భరోసా కింద రూ. 15వేలు పింఛన్ అందజేయాలని వీరఘట్టం మండలం దశమంతపురం గ్రామానికి చెందిన ఎస్. విజయకుమార్ దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డ్వామా పీడీ రామచంద్రరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జవాబుదారీ తనంతో పిటిషన్లకు పరిష్కారం

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి జవాబుదారీ తనంతో వ్యవహరించి పిటిషన్లకు పోలీసు శాఖ పరంగా పరిష్కారం చూపించడనున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల దగ్గర 9 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో మోసాలు ఉన్నాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితరులు ఉన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 56 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 56 వినతులు వచ్చాయి. పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి వినతులు స్వీకరించారు. చెక్‌డ్యాం నిర్మించాలని కుమ్మరిగుంటకు చెందిన శంకరరావు కోరారు. సీసీ రహదారి నిర్మించాలని కోతాంకు చెందిన బిడ్డిక శ్రీను విన్నవించారు. గురండికి చెందిన రవికుమార్ చేసిన రోడ్డుపనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. లక్కాయిగూడ-శిలిగాంకు నూతన రహదారి నిర్మించాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. సన్నాయిగూడ గిరిజనులు పవర్‌వీడర్ ఇప్పించాలని విన్నవించారు. సీసీ డ్రైన్స్ నిర్మించాలని దిగువదరబ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, పీహెచ్‌ఓ ఎస్‌వీ గణేష్, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, డీఈ సింహాచలం పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే ధ్యేయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ప్రజాసమస్యల పరిష్కార 187 వినతులు



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు పోటెత్తిన అర్జీదారులు



పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు అర్జీదారుల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్రాలకు అర్జీదారులు రావాల్సిన పనిలేకుండా గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల పేరుతో దాదాపు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల ప్రభావం కనబడలేదు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 187 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా 88 వినతులు రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయి. అర్జీల స్వీకరణ ప్రక్రియలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీ, ప్రమీల గాంధీ పాల్గొన్నారు.

విజయనగరం క్రైమ్: ఎస్పీ వకుల్ జిందల్ ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలపరిష్కార వేదికకు 42 ఫిర్యాదులు. అందాయి. భూతగాదాలు, కుటుంబసమస్యలు, మోసాలకు చెందిన సమస్యలతో ఫిర్యాదు దారులు ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి వచ్చారు. ఫిర్యాదు దారుల సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ వకుల్ జిందల్ ఫిర్యాదుల్లో ఉన్న విషయాలను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫిర్యాదుదారుల ముందే ఫోన్‌చేసి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అంతేకాకుండా వీడియో కాల్ చేసి మరీ స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదులకు ఏడు రోజుల్లో పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ..!



దర్యాప్తు చేస్తున్న సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం పోతనాపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కిలపర్తి కొండమ్మ ఇంట్లో సోమవారం ఉదయం దొంగతనం జరిగింది. ఈ చోరీపై ఎస్.కోట సీఐ నారాయణమూర్తి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిలపర్తి కొండమ్మ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లతో ఎస్‌కోట-విజయనగరం ప్రధాన రహదారిలో నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం 10గంటల సమయంలో కొండమ్మ ఉపాధి పనులకు వెళ్లగా, కోడళ్లు పోతనాపల్లి గ్రామంలోకి వెళ్లారు. పెద్దకొడుకు తన కూతుర్ని తీసుకుని అదే గ్రామంలో ఉన్న మరదలి ఇంటికి వెళ్తూ, ఇంటికి తాళం వేసి గేటు పక్కన ఉన్న కుండీ కింద తాళం చెవి పెట్టాడు. 11.30 సమయంలో ఇంటికి వచ్చిన కొండమ్మ యథావిధిగా తాళం తీసి కాసేపు పనులు చేసుకున్న తర్వాత కొడుకు బెడ్‌రూమ్ తలుపు తెరిచి, బట్టలు కింద పడి ఉండటం గమనించి లబోదిబోమంటూ గోలచేసింది. దీంతో కుటుంబసభ్యులు వచ్చి చూడగా రెండు బెడ్‌రూమ్స్‌లో బీరువాలు తెరిచి బంగారం, నగదు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ నారాయణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్ టీమ్ ఎస్సై మురళీమోహన్‌తో ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కాగా గేటు పక్క కుండీకింద ఉన్న తాళం చెవిని తీసి, దొంగతనం చేసి మళ్లీ తాళం అక్కడే గుట్టుగా ఉంచటంతో స్థానికులు, తెలిసిన వారే దొంగతనానికి పాల్పడి ఉంటారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజ్ సేకరించే పనిలో ఉన్నారు. ఈ చోరీలో సుమారు 15తులాల బంగారం, రూ.35వేల నగదు పోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో శాఖాపరమైన విధులను గుర్తించాలి



శిక్షణ ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ

పార్వతీపురం రూరల్: జిల్లాకు శిక్షణ నిమిత్తం కేటాయించిన 36మంది ప్రొబేషనరీ ఎస్సైలు సోమవారం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారితో ఎస్పీ మాట్లాడుతూ దిశానిర్దేశం చేశారు. పోలీస్‌శాఖలో అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలను ముందుగా అభినందించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లను శిక్షణ నిమిత్తం వారికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీతో పారదర్శకంగా జవాబుదారీ తనం పాటిస్తూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని కోరారు. కేటాయించిన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలను తరచూ సందర్శిస్తూ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకం అవాలని సూచించారు.

కుస్తీలో కొండవెలగాడ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన జూనియర్ కుస్తీ పోటీల్లో ఎల్ చైతన్య 44 కిలోల విభాగంలో బంగారు పతకం, ఎం.రణదీప్ 48 కిలోల విభాగంలో రజత పతకం, ఎస్ రామాంజనేయులు 47 కిలోల విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. జ్ఞానశంకర్, పీడీ పతివాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

కొఠియా గ్రామాల్లో పర్యటనకు భద్రత కల్పించండి

- కలెక్టర్‌కు లోక్‌సత్తా వినతిపత్రం



కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా గ్రామాల్లో పర్యటించనున్నామని తమకు భద్రత కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పద కొఠియా పరిధిలో గల 21 గ్రామాల్లో ఆందోళన చెందుతున్న గిరిజనులందరికీ మద్దతుగా ఉండి పర్యటన చేపడతామని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అంగన్వాడీ భవనాలను కూల్చివేసి దిగువ శెంబి వద్ద పవర్ ప్రాజెక్టు నిర్మిస్తోందని, దీనిని అడ్డుకున్న గిరిజనులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రెవెన్యూ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులు, ఫారెస్టు అధికారులు, 108 వాహనాలను ఒడిశా అధికారులు, పోలీసులు వివాదాస్పద గ్రామాల్లోకి రానివ్వకపోయినా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహనరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గొర్లి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఇండియా పారా విజేతకు సత్కారం



సూర్యనారాయణను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం: ఈ నెల 5,6 తేదీలలో ఒడిశాలోని సంబల్‌పూర్‌లో జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పారా బిల్డర్ ఈదుబిల్లి సూర్యనారాయణ గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సూర్యనారాయణను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం మండలం వంగర గ్రామానికి చెందిన సూర్యనారాయణ జాతీయస్థాయిలో రాణించి మెడల్స్ సాధించడం జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి క్రీడల్లో జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. పారా క్రీడలకు సంబంధించిన వివరాలను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ మంత్రికి వివరించారు. పారా క్రీడాకారులకు సహకారం అందేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

త్వరలో శాటిలైట్ వ్యవస్థ పటిష్టం

- విపత్తులు, అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్



అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న విపత్తులు, అగ్నిమాపక డైరెక్టర్ జి. శ్రీనువాసులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా శాటిలైట్ వ్యవస్థను పటిష్టపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విపత్తులు, అగ్నిమాపక శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250కోట్లతో రాష్ట్రంలోని అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణకు త్వరలోనే శ్రీకారం చుట్టేందుకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 గ్నిమాపక భవనాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. అందులో పార్వతీపురం, పాలకొండ అగ్నిమాపక కేంద్రాల నరుద్ధరణకు సంబంధించి ఒక్కో కేంద్రానికి రూ. 2.5కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ రంజన్ రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనిబాబు, అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- పాలకొండ డీఎస్పీ రాంబాబు హితవు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు, పక్కన సీఐ చంద్రమౌళి, వీరఘట్టం, పాలకొండ ఎస్సైలు కళాధర్, ప్రయోగమూర్తి

పాలకొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు హితవు పలికారు. ఇటీవల వీరఘట్టం మేజర్ పంచాయతీతో పాటు, విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలో జరిగిన సైబర్ నేరాలను తమ సిబ్బంది ఛేదించిన సందర్భంగా సోమవారం పాలకొండ సబ్ డివిజన్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. డీఎస్పీ తెలియజేసిన కేసుల వివరాలిలా ఉన్నాయి.. గత నెల 29న సంతకవిటి మండలానికి చెందిన బొద్దాన సుధాకర్ నుంచి రూ.12 వేలు, కోరాడ సంతోష్‌కుమార్ నుంచి రూ.15 వేలతో పాటు గత నెల 31న వీరఘట్టం మేజర్ పంచాయతీకి చెందిన ఎం.ప్రతాప్ నుంచి రూ.28 వేలు ఫోన్‌పే ద్వారా కాజేసిన సైబర్ నేరగాడిని పోలీసులు విజయవాడలో పట్టుకున్నారు. తొలుత సైబర్ నేరగాడు బాధితులకు 7569341175 అనే ఫోన్ నంబర్ ద్వారా కాల్స్ చేయడంతో ఆ నంబర్‌ను ట్రాక్ చేసి విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు వీరఘట్టానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్, కానిస్టేబుల్ వి.నవీన్‌లను బృందంగా ఏర్పాటు చేసి విజయవాడకు పంపించారు. వారిని సీఐ ఎం.చంద్రమౌళి, వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ మానిటరింగ్ చేస్తూ సైబర్ నేరగాడి ఫోన్ ట్రాక్ చేసి ఎప్పటికప్పుడు ఆ వివరాలను క్రైమ్ టీమ్‌కు తెలియజేశారు. ఈ విధంగా నాలుగు రోజుల పాటు విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఫోన్‌నంబర్ ఆధారంగా గాలించి సైబర్ నేరస్తుడు మున్న వెంకట నవీన్ ఆచూకీ గుర్తించి విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

అన్ని కోణాల్లో విచారణ

ప్రస్తుతం వీరఘట్టం, సంతకవిటి మండలాల్లో సైబర్ నేరాలకు పాల్పడిన మున్న వెంకట నవీన్ బీటెక్ చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఇలా సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడి దగ్గర నుంచి రూ.55 వేలు రికవరీ చేశారు. నిందిత వ్యక్తి గూగుల్‌లో వ్యాపారులు, పెద్ద పెద్ద వర్తకుల ఫోన్ నంబర్లు సేకరించి వారికి ఎస్సై నంటూ, ఏఎస్సై నంటూ, కానిస్టేబుల్ నంటూ ఫోన్‌లు చేసి వారిని నమ్మించి ఫోన్ పే ద్వారా డబ్బులు కాజేశాడని పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని విచారణ చేసి పాలకొండలో కోర్టులో హాజరు పరిచారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు..

సైబర్ నేరాన్ని విజయవాడ వెళ్లి ఛేదించిన వీరఘట్టం హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్, కానిస్టేబుల్ వి.నవీన్‌లను, మానిటరింగ్ చేసిన వీరఘట్టం ఎస్సై జి.కళాధర్, సీఐ ఎం.చంద్రమౌళిలను డీఎస్పీ రాంబాబు అభినందించారు. సమావేశంలో పాలకొండ ఎస్సై ప్రయోగమూర్తి పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని మహిళకు గాయాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. సోమవారం కురుపాం మండలంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలం జి.శివడ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బి.జీవిరావు, భార్య ప్రియతో కలిసి కురుపాం వస్తుండగా..కురుపాం నుంచి చందు అనే యువకుడు ద్విచక్రవాహనంపై గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని మూలిగూడ జంక్షన్ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రియకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన ప్రియను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా వైద్యసేవలు అందించారు. సంఘటనపై కురుపాం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.